GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 23-10-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# వస్తాకొండూరు శివారులో రాతి తవ్వకాల దుమారం!

## సర్వే నంబర్ 401లో భారీ తవ్వకాలు.. జనగామ వైపు టిప్పర్ల పరుగులు!

## అనుమతులు ఉన్నాయా? అక్రమ తవ్వకాలా? మైనింగ్, రెవెన్యూ అధికారులకు సవాల్‌గా మారిన వ్యవహారం!



హిటాచీలతో రాళ్ల తవ్వకాలు.. పదుల సంఖ్యలో టిప్పర్లతో రవాణా.. అయినా అనుమతులపై స్పష్టత ఏదీ? యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వస్తాకొండూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 401లో జరుగుతున్నట్లు సమాచారం అందుతున్న భారీ రాతి తవ్వకాలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. రాత్రింబవళ్లు తవ్వకాలు సాగుతున్నాయన్న సమాచారం నేపథ్యంలో సంబంధిత శాఖల పర్యవేక్షణపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.



**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:** సర్వే నంబర్ 401లో రాళ్లను తవ్వి టిప్పర్ల ద్వారా జనగామ వైపు తరలిస్తున్నట్లు స్థానికంగా సమాచారం వినిపిస్తోంది. అయితే ఈ తవ్వకాలకు మైనింగ్ శాఖ అనుమతులు ఉన్నాయా? రవాణాకు అవసరమైన పత్రాలు ఉన్నాయా? అనుమతించిన పరిమితుల్లోనే తవ్వకాలు జరుగుతున్నాయా అనే అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. అనుమతుల వివరాలను వెల్లడించి ప్రజల్లో నెలకొన్న సందేహాలకు అధికారులు తెరదించాల్సిన అవసరం ఉంది.



మిగతా 2లో




2లో

# దసరా వేడుకల్లో వివక్ష వివాదం!!

- బీజేపీ మహిళా వార్డు సభ్యురాలి ఫొటో ప్రదర్శించలేదని నేతల అభ్యంతరం
- ఉత్సవాల నిర్వహణపై కమలదళం ఆగ్రహం.. విచారణకు డిమాండ్
- శ్రీరాముడి ఊరేగింపును నిలిపి రికార్డింగ్ డ్యాన్సులకు ప్రాధాన్యమిచ్చారని ఆరోపణలు



4లో

# తుక్కుగూడ,మంఖాల్ ,పేదలను పట్టించుకునే నాథుడే లేడా?

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** పేదలకు అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన గృహజ్యోతి జీరో కరెంట్ బిల్లు పథకం తుక్కుగూడ మున్సిపల్ ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని తుక్కుగూడ వార్డులో వందలాది పేద కుటుంబాలు జీరో బిల్లుకు నోచుకోక, నెలనెలా వందల రూపాయల కరెంట్ బిల్లుల భారంతో సతమతమవుతున్నాయి.

**శంషాబాద్ ఆఫీస్ చుట్టూ ప్రదక్షిణలు...**

తుక్కుగూడ ప్రజలు జీరో బిల్లు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న శంషాబాద్ సర్కిల్ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. రోజు కూలీ చేసుకుని బతికే పేదలు ఒక పూట కూలీ వదులుకుని, బస్సులు, ఆటోలు లేక అష్టకష్టాలు పడి ఆఫీసుకు వెళితే అక్కడ అధికారుల నుండి సరైన సమాధానం లేదని వాపోతున్నారు.ఒకవైపు జీరో బిల్లు అమలు కాకపోవడం, మరోవైపు కరెంట్ ఏఈ, డీఈలు తమ సిబ్బందితో ఇంటింటికీ వచ్చి "రూపాయి బిల్లు ఉన్నా కట్టాల్సిందే, లేకుంటే కేసులు పెడతాం" అంటూ బెదిరిస్తున్నారని తుక్కుగూడ వాసులు ఆరోపిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే జీరో బిల్లు చేయకుండా వసూళ్లకు పాల్పడుతున్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**అధికారుల నిర్లక్ష్యపు సమాధానాలు:**

ఈ విషయంపై శంషాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు ను వివరణ కోరగా... "మాకు ఓటీపీలు రావడం లేదు. మున్సిపాలిటీ ఉన్నప్పటికీ కమిషనర్ కి ఓటీపీలు పోతున్నాయి, మాకు రావడం లేదు. ఏం చేయాలి? సీసీకి లెటర్ పెట్టాం, అయినా కావడం లేదు" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.దీనిపై తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ కమిషనర్ వాణి ని వివరణ కోరగా...నాకు ఎలాంటి ఓటీపీలు రావడం లేదు. నేను తుక్కుగూడ నుండి ట్రాన్స్ఫర్ అయిపోయాను. నాకు ఎందుకు వస్తాయి? అది నిజం కాదు. చాలా మంది కాల్స్ చేసి అడుగుతున్నారు, నాకు ఎలాంటి ఓటీపీలు రావడం లేదు" అని స్పష్టం చేశారు. ఇరువురి మాటల్లో పొంతన లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

**పాలకులు స్పందించాలి:**

"మా గ్రామాల నుండి శంషాబాద్ ఆఫీస్ కి రావాలంటే సరైన బస్సు, ఆటో సౌకర్యం ఉండదు. వచ్చినా ఫలితం శూన్యం. జీహెచ్ఎంసీలో కలిసి సంవత్సరం అవుతున్నా ఇంకా ఈ నిర్లక్ష్యమే కొనసాగుతోంది. అసలు గృహజ్యోతి పథకం పేదల కోసమే కదా? మా గోడు ఎవరికి చెప్పుకోవాలి " అంటూ తుక్కుగూడ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తుక్కుగూడ వార్డులో పెండింగ్ లో ఉన్న వందలాది గృహజ్యోతి దరఖాస్తులను పరిశీలించి, ఓటీపీ సాంకేతిక సమస్యను వెంటనే పరిష్కరించి పేదలకు జీరో బిల్లు అందేలా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రవాణా రంగ సమస్యలను పరిష్కరించాలి



**లారీ యజమానులు, డ్రైవర్ల ఇబ్బందులపై అధికారులకు వినతి**

**టీఎల్ఓఏ--ఇంటక్ రాష్ట్ర అధ్యక్షుడు మంచి రెడ్డి రాజేందర్ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం(క్రైమ్ మిర్రర్):** రాష్ట్రవ్యాప్తంగా లారీ యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు, హెల్పర్లు, ఇతర రవాణా రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ (టీఎల్ఓఏ--ఇంటక్) రాష్ట్ర అధ్యక్షుడు మంచి రెడ్డి రాజేందర్ రెడ్డి కోరారు. రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాల సంక్షేమం, ఆర్థిక భారం తగ్గించడం లక్ష్యంగా తమ సంఘం నిరంతరం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం రవాణా శాఖ ఇన్స్పెక్టర్ అమర్నాథ్ను కలిసి రవాణా రంగానికి సంబంధించిన పలు సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి సహకరించాలని వినతిపత్రం అందజేశారు. తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య లారీల రాకపోకలకు సంబంధించి కౌంటర్ సిగ్నేచర్, సింగిల్ పర్మిట్ విధానాల్లో యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాహనాల ఫిట్నెస్ రెన్యువల్ సమయంలో రేడియం స్టిక్కర్ల పేరుతో, లారీ యజమానులపై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని తగ్గించాలని కోరినట్లు రాజేందర్ రెడ్డి తెలిపారు. స్టిక్కర్ల సరఫరా కోసం ఆన్లైన్ ఓపెన్ కాంపిటీషన్ విధానంలో కాంట్రాక్టర్లను ఎంపిక చేసి, తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామని అధికారులు సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం స్క్రాప్ చేసిన పాత వాహనాలకు సైతం రోడ్డు పన్ను బకాయిల నోటీసులు అందుతుండటంతో, యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులకు వివరించారు. ఇలాంటి సమస్యలను పరిశీలించి, అర్హులైన వాహన యజమానులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నేషనల్ పర్మిట్కు సంబంధించిన నిబంధనలు, ఇసుక రవాణా వాహనాలకు వర్తించే, ఏఐఎస్-140 పరికరాల విషయంలో నెలకొన్న సందిగ్ధతను తొలగించాలని కోరారు. ఒకే వాహనంపై అనవసరంగా అదనపు ఖర్చులు పడకుండా, సంబంధిత నిబంధనలపై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు, హెల్పర్లు, ఇతర కార్మికుల కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న, సంక్షేమ బోర్డులో అర్హులైన వారందరికీ అవకాశం కల్పించాలని రాజేందర్ రెడ్డి కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మమ్మాయిదేవి లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్సు శ్రీకాంత్, మల్లారెడ్డి, చెరుకూరి బిక్షపతి, నరుకుడి ప్రసాద్, నరేష్, రాజు గౌడ్, మహేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.





# వస్తాకొండూరు శివారులో రాతి తవ్వకాల దుమారం!

(మొదటి పేజీ తరువాయి)

భారీ వాహనాల రాకపోకలతో గ్రామీణ రహదారులు దెబ్బతినే ప్రమాదం ఉందని, దుమ్ము ధూళితో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాతి తవ్వకాల వల్ల పర్యావరణానికి ఎలాంటి ప్రభావం కలుగుతోంది? నిబంధనల ప్రకారం రక్షణ చర్యలు చేపడుతున్నారా? అన్న అంశాలపై కూడా పరిశీలన అవసరం.

**"మైనింగ్, రెవెన్యూ శాఖలు ఏం చేస్తున్నాయి"?**

భారీ స్థాయిలో తవ్వకాలు, రవాణా జరుగుతున్నట్లు సమాచారం వెలువడుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సర్వే నంబర్ 401లో తవ్వకాల అనుమతులు, రవాణా పత్రాలు, నిబంధనల అమలును పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ తవ్వకాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అనుమతులతోనే తవ్వకాలు సాగుతున్నట్లయితే ఆ వివరాలను ప్రజలకు తెలియజేయాలి. వస్తాకొండూరు శివారులో రాతి తవ్వకాలపై అధికారులు ఎప్పుడు స్పందిస్తారు? క్షేత్రస్థాయి తనిఖీలు ఎప్పుడు చేపడతారు.

# నీటి వసతిని బట్టి పంటలు వేసుకోవాలి

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** మునుగోడు మండలం పులిపలుపుల గ్రామంలోని రైతు వేదికలో ప్రత్యేక రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా"ఖేతి బచావో అభియాన్"కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎల్ ని నో ప్రభావం వలన వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి కాబట్టి అందరూ కూడా నీటి వసతిని బట్టి పంటలు వేసుకోవాలన్నారు.వరి పంటను వేయకుండా ఆరుతడి పంటలు వేసుకోవాలని తెలియజేశారు. రానున్న కాలంలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడవచ్చు అని సూచించారు.జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీ వినోద్ కుమార్, డిసిఓ మమత,మార్కెటింగ్ ఏడి ఛాయాదేవి, చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ , వ్యవసాయ సహాయ సంచాలకులు మునుగోడు , మండల వ్యవసాయ అధికారి మునుగోడు, ఉద్యాన శాఖ అధికారి, సెక్రటరీ, ఏఈవోలు పులిపలుపుల మరియు కొరటికల్ క్లస్టర్ మరియు రైతులు పాల్గొన్నారు..





# బాధిత కుటుంబానికి గోలి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సహాయం

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: కల్వకుర్తి నియోజకవర్గంలోని వేపూర్ గ్రామానికి చెందిన శంకర్ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా కల్వకుర్తి పట్టణంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ విషయం వేపూర్ గ్రామానికి చెందిన కల్వకుర్తి మాజీ వైస్ ఎంపీపీ (గోవర్ధన్ ద్వారా తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీ గోలి శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించారు. హైదరాబాద్ లోని జీవన్ హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న శంకర్‌ను, ఆయన కుమార్తె భూమికను, కుమారుడిని పరామర్శించారు. ప్రమాదం కారణంగా శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి రూ. 8,000 ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ, ఎలాంటి ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, అనిల్ కుమార్(హైజాక్ ), గోపి తదితరులు ఉన్నారు.

# పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

డిండి లిఫ్ట్ ప్రాజెక్టును నిలిపివేయాలి

కల్వకుర్తిలో లక్ష సంతకాల సేకరణ ప్రారంభం

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: పాలమూరు ప్రాంత రైతులకు సాగునీరు అందించేందుకు పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని, డిండి లిఫ్ట్ ప్రాజెక్టును నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పండుగ సాయన్న జయంతి సందర్భంగా కల్వకుర్తి పట్టణంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దశాబ్దాలుగా పాలమూరు రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని, అనేక ప్రాజెక్టులు పూర్తికాక రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జేఏసీ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ఈ ప్రాంతానికి న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. డిండి లిఫ్ట్ ప్రాజెక్టుతో ప్రభావితమయ్యే గ్రామాల సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యంగా ఎర్రవెల్లి గ్రామ ప్రజల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లవద్దని డిమాండ్ చేశారు. రైతుల జీవనోపాధి, గ్రామాల భవిష్యత్తు, ప్రజల ప్రయోజనాలకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. లక్ష సంతకాల సేకరణ ద్వారా పాలమూరు ప్రజల సమస్యలను ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడమే లక్ష్యమని జేఏసీ నాయకులు తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, సాగునీటి సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, స్థానిక ప్రజలు, రైతులు పాల్గొని లక్ష సంతకాల ఉద్యమానికి మద్దతు తెలిపారు.




# నాలుగు మండలాల్లో వీధిదీపాలకు రూ.7.14 కోట్లు మంజూరు

**291 పనులకు నిధులు.. త్వరలో పనులు ప్రారంభం: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల్, మాడుగుల, తలకొండపల్లి మండలాల్లో హైమాస్ట్ లైట్లు, వీధిదీపాల ఏర్పాటుకు హెచ్ఎండీఏ నిధుల ద్వారా రూ. 7.14 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయని పేర్కొన్నారు. గురువారం కడ్తాల్ మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాలుగు మండలాల్లో లైట్ల ఏర్పాటుకు మంజూరైన నిధుల ప్రొసీడింగులను టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆయా మండలాల నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొత్తం 291 పనులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఆమనగల్లు మండలంలో 70 పనులకు రూ. 1.74 కోట్లు, కడ్తాల్ మండలంలో 65 పనులకు రూ. 1.30 కోట్లు, మాడుగుల మండలంలో 78 పనులకు రూ. 2.54 కోట్లు, తలకొండపల్లి మండలంలో 78 పనులకు రూ. 1.56 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని, రెండో విడతలో మరిన్ని గ్రామాలకు నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఇప్పటికే రూ. 6 కోట్లతో హైమాస్ట్ లైట్లు, వీధిదీపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతర్గత మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 10.60 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభమయ్యాయని



చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి మహర్దశ ఏర్పడిందని ఎమ్మెల్యే అన్నారు. గ్రామాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించి, పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి, దారెడ్డి బాల్ రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, శివలింగం, పోతుగంటి శంకర్, బట్టు కిషన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలి

రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశానిర్దేశం

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మార్కెట్ చైర్మన్ యాట గీత నరసింహ ముదిరాజ్

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశమున్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. గురువారం మండల పరిధిలోని రాంనుంతల రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ పరిస్థితులు, పంటల సాగులో అనుసరించాల్సిన పద్ధతులపై ఆయన పలు సూచనలు చేశారు. తక్కువ కాలంలో దిగుబడి వచ్చే పంటలతో పాటు కంది, పెసర, జొన్న వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎంచుకోవాలని మంత్రి సూచించారు. భూసార పరిరక్షణ, నేల ఆరోగ్యం, పంటల సంరక్షణ, నీటి పొదుపు పద్ధతులపై 'ఖేత్ బచావో అభియాన్' ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు తెలిపారు. పత్తి కొనుగోళ్లలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, తేమ శాతాన్ని నియంత్రించి మలినాలు లేని నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తీసుకురావాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ యాట గీత



నరసింహ ముదిరాజ్ మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి రైతులు సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ పంట నష్టాలను తగ్గించుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓలు మీనాక్షి, నికిత, వినోద్, రైతులు, దేవర శెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జలవనరుల సంరక్షణే లక్ష్యంగా అమృత్ సరోవర్ కార్యక్రమాలు

ముకురాల, పంజాగుల, గుండూర్ గ్రామాల్లో శ్రమదానం

చెరువుల శుభ్రత, మొక్కల నాటకం

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: జలవనరుల సంరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ కల్వకుర్తి మండలంలోని ముకురాల, పంజాగుల, గుండూర్ గ్రామాల్లో మిషన్ అమృత్ సరోవర్ ప్రత్యేక ప్రచారం--6లో భాగంగా గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమృత్ సరోవర్ ప్రదేశాల్లో పరిశుభ్రత పనులు చేపట్టి, స్వచ్ఛంద శ్రమదానం నిర్వహించారు. ఎంఐ ట్యాంకులను శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటారు. జలవనరుల పునరుద్ధరణ, నిర్వహణపై దృష్టి సారించారు. ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గాలి యాదయ్య, సంబంధిత గ్రామాల సర్పంచులు పరుశరాములు, ఎల్లయ్య, లక్ష్మమ్మ, గ్రామ కార్యదర్శులు దీప, పవన్, రామకృష్ణ, సాంకేతిక సహాయకులు లక్ష్మి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# దసరా వేడుకల్లో వివక్ష వివాదం!!

- బీజేపీ మహిళా వార్డు సభ్యురాలి ఫొటో ప్రదర్శించలేదని నేతల అభ్యంతరం
- ఉత్సవాల నిర్వహణపై కమలదళం ఆగ్రహం.. విచారణకు డిమాండ్
- శ్రీరాముడి ఊరేగింపును నిలిపి రికార్డింగ్ డ్యాన్సులకు ప్రాధాన్యమిచ్చారని ఆరోపణలు

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** మహాదేవపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన దసరా ఉత్సవాలు రాజకీయ వివాదానికి దారితీశాయి. ఉత్సవాల సందర్భంగా గ్రామపంచాయతీకి చెందిన బీజేపీ మహిళా వార్డు సభ్యురాలి ఫొటోను ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై ప్రదర్శించలేదని బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధుల మధ్య పార్టీ ఆధారంగా వివక్ష చూపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



### ఎంపీడీవో కార్యాలయానికి బీజేపీ నేతలు

మహిళా వార్డు సభ్యురాలి ఫొటో ప్రదర్శించకపోవడంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసేందుకు బీజేపీ నాయకులు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లారు. ఎంపీడీవో అందుబాటులో లేకపోవడంతో జూనియర్ అసిస్టెంట్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలికితీసి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

### పండుగ వేడుకల్లో రాజకీయాలెందుకు?

ఈ సందర్భంగా బీజేపీ మహాదేవపూర్ మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్ మాట్లాడుతూ.. దసరా వంటి పవిత్రమైన పండుగలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులందరికీ సమాన గౌరవం కల్పించాలని పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణలో పక్షపాతానికి తావుండకూడదని స్పష్టం చేశారు.

### శ్రీరాముడి ఊరేగింపునకు నిరీక్షణ.. డ్యాన్సులకు ప్రాధాన్యమా?

దసరా ఉత్సవాల్లో రికార్డింగ్ డ్యాన్సులకు ప్రాధాన్యమిస్తూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు విరుద్ధంగా కార్యక్రమాలు నిర్వహించారని రాంశెట్టి మనోజ్ ఆరోపించారు. శ్రీరాముడి ఊరేగింపును వేచి ఉంచి, రావణ వధ కార్యక్రమాన్ని మంత్రి సోదరుడి కోసం గంటల తరబడి ఆలస్యం చేశారని విమర్శించారు. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించేందుకే దేవుడికి సంబంధించిన కార్యక్రమాన్ని ఆలస్యం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, ఈ ఆరోపణలపై ఉత్సవాల నిర్వాహకుల వివరణ అందుబాటులో లేదు.

### నిష్పక్షపాత విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి

ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులందరికీ సమాన గౌరవం కల్పించాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. దసరా ఉత్సవాల నిర్వహణపై వచ్చిన ఆరోపణలపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఉత్సవాల నిర్వహణలో నిజంగా ఏమైనా లోపాలు జరిగితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి జనగామ పోచయ్య, మండల ప్రధాన కార్యదర్శి బిల్ల శ్రావణ్ కుమార్, నాయకులు దాడిగేలా వెంకటేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచే కుష్ఠు రోగుల గుర్తింపునకు ఇంటింటి సర్వే!

**650 బృందాలతో తనిఖీలు.. హాజీపూర్ పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ పరిశీలన**

**మంచిర్యాల అక్టోబర్ 22 (క్రైమ్ మిర్రర్):** కుష్ఠు వ్యాధిగ్రస్తులను తొలిదశలోనే గుర్తించి, వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు గురువారం నుంచి జిల్లావ్యాప్తంగా ఇంటింటి సర్వేను చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. నవంబర్ 4వ తేదీ వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో భాగంగా 650 ప్రత్యేక బృందాలతో 2.12 లక్షల ఇళ్లలో పరిశీలన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సుమారు 8 లక్షల జనాభాను లక్ష్యంగా చేసుకొని ఈ సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు. చర్మంపై స్పర్శ తెలియని మచ్చలు ఉంటే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని డీఎంహెచ్‌వో సూచించారు. కుష్ఠు వ్యాధిని బహుళ ఔషధ చికిత్సతో (ఎండీటీ) పూర్తిగా నయం చేయవచ్చని, తొలిదశలోనే గుర్తిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై వైద్య సిబ్బంది, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గ్రామపంచాయతీల సహకారంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వారానికోసారి క్రమం తప్పకుండా 'డ్రై డే' నిర్వహించాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించడం, మందుల పంపిణీతో పాటు బీపీ,షుగర్ పరీక్షలు నిర్వహించి, ఆ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. సూపర్‌వైజర్లు సబ్ సెంటర్లను క్రమం తప్పకుండా సందర్శిస్తూ మాతా శిశు సంరక్షణ, టీకాలు, ప్రసవాలు, కుటుంబ సంక్షేమం, ఎయిడ్స్ నివారణ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయాలని స్పష్టం చేశారు. పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న సమాచార, విద్యా, ప్రచార (ఐఈసీ) కార్యక్రమాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు రఘుపతి, పద్మ, నర్సింగ్ అధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.





## తసార్ పట్టు రైతులకు అండగా సర్పంచ్

- పెంపక కేంద్రాలు, పంట పొలాల పరిశీలన
- రైతుల సమస్యలపై సర్పంచ్ ఆరా
- అవసరమైన సహకారం అందిస్తామని హామీ

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** గ్రామీణ ప్రాంతాల్లో పట్టు పరిశ్రమపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న రైతులకు అండగా నిలుస్తామని మహాదేవపూర్ సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్ భరోసా ఇచ్చారు. తసార్ పట్టు సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం మహాదేవపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న తసార్ పట్టు పురుగుల పెంపక కేంద్రాలను, పంట పొలాలను సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్ సందర్శించి పరిశీలించారు. పట్టు పురుగుల పెంపకం విధానం, వాటి ఎదుగుదల, దిగుబడి తదితర అంశాలపై రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పట్టు పురుగులకు సోకుతున్న వ్యాధులు, కీటకాల ఉధృతి, సాగు సమయంలో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి రైతులతో చర్చించారు. పట్టు సాగులో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తసార్ పట్టు పరిశ్రమపై ఆధారపడిన రైతుల సంక్షేమానికి గ్రామ పంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. పట్టు పురుగులకు వ్యాధులు సోకకుండా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి, రైతులకు అవసరమైన మందులు, సాంకేతిక సలహాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామంలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి, రైతుల ఆర్థిక పురోగతికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, తసార్ పట్టు రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసిన లక్ష్మీ నర్సింహా రెడ్డి



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ను తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ లక్ష్మీ నర్సింహ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ కు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి పర్వదినం సందర్భంగా కేటీఆర్‌కు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ లను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. అదేవిధంగా రాబోయే పట్టభద్రుల ఎన్నికలలో కలిసికట్టుగా అందరూ సమన్వయంతో పనిచేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని కేటీఆర్ సూచించినట్లు లక్ష్మీ నరసింహా రెడ్డి తెలిపారు.



# మర్రిగూడలో ఘనంగా పండుగ సాయన్న జయంతి

**పేదల అభ్యున్నతికి సాయన్న చేసిన సేవలు చిరస్మరణీయం**

**మర్రిగూడ (క్రైమ్ మిర్రర్):** మర్రిగూడలో పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటాలు, అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం మండల నాయకుడు జింకల లింగస్వామి ముదిరాజ్ మాట్లాడుతూ.. బహుజన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం పండుగ సాయన్న చూపిన మార్గంలో, ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. సమాజంలోని అణగారిన వర్గాలకు ఆత్మగౌరవాన్ని అందించేందుకు ఆయన చేసిన కృషి, త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. పేదల అభ్యున్నతి, సామాజిక సమానత్వం కోసం సాయన్న చేసిన సేవలు, నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పండుగ సాయన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు ఐక్యంగా కృషి చేయాలని ఆయన అన్నారు. బహుజన వర్గాల అభ్యున్నతికి, హక్కుల సాధనకు సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు డెంకని జానయ్య, కుక్కల వెంకటేష్, జింకల రమేష్, కుక్కల మహేందర్, డెంకని రవి, జింకల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కొర్ర తండా అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తా. .

**తండ్రి జ్ఞాపకార్థం పలు అభివృద్ధి పనులకు సహకారం..**

**కొర్ర రామ్ నాయక్.**

**క్రైమ్ మిర్రర్ (రంగారెడ్డి ప్రతినిధి):** మాడ్గుల మండలం కొర్ర తండా అభివృద్ధి కోసం పాటుపడ్డ కీర్తిశేషులు భాగ్య నాయక్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాయ్ సాఫ్ట్ వేర్ గ్లోబల్ యూఎస్ఏ బేస్డ్ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కొర్ర రాం నాయక్ రెండు హైమాక్స్ లైట్లు, గ్రామపంచాయతీలో కుర్చీలు అందజేశారు. దసరా పండుగ వేళ తండాలో వెలుగులు నింపిన రామ్ నాయక్ ను గిరిజనులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొర్ర శంకర్ నాయక్, బీసీ సంఘాల ఉద్యమ నేత శ్యామ్ సుందర్, గిరిజన బిడ్డ ప్రత్యూష రాథోడ్ లు పాల్గొని రామ్ నాయక్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జబ్బర్ లాల్ నాయక్, ఉపసర్పంచ్ బాలు నాయక్, మాజీ సర్పంచ్ రామ్ నాయక్, నాగిల్ల గ్రామ సర్పంచ్ సంతోష రాజు గౌడ్ అధిక సంఖ్యలో యువకులు గిరిజనులు పాల్గొన్నారు.




# పేదల పక్షాన పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న

- అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకం
- భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు
- పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** ప్రజల హక్కుల కోసం, పేదల సంక్షేమం కోసం పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ పేర్కొన్నారు. ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను గురువారం భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

**పేదల పక్షాన నిలిచిన పోరాట యోధుడు**

తెలంగాణ ప్రజల జానపద చరిత్రలో పండుగ సాయన్నకు ప్రత్యేక స్థానం ఉందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పేదల పక్షాన నిలిచి, అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రజావీరుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పేదలకు అండగా నిలవడం, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడటం ఆయన జీవితంలో ప్రధానమైన విలువలని తెలిపారు.

**సమానత్వం, మానవత్వమే సమాజ అభివృద్ధికి పునాది**

పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో సమానత్వం, మానవత్వం, సేవాభావం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ, బలహీన వర్గాలకు అండగా నిలవడం ద్వారా ఆయన ఆశయాలను భావితరాలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, ఆర్ఐలు కాశీరాం, పూర్ణచందర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొని ప్రజావీరుడు పండుగ సాయన్నకు నివాళులర్పించారు.

# ఐక్యత ఫౌండేషన్ జాబ్ డ్రైవ్‌లో 56 మందికి ఉద్యోగాలు

**రెండో విడతలో 31 మందికి కొలువులు..**

**యువతకు అభినందనలు తెలిపిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ చేపట్టిన 25వ జాబ్ డ్రైవ్‌లో ఇప్పటివరకు 56 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 13న నిర్వహించిన ఈ జాబ్ డ్రైవ్‌కు వివిధ మండలాల నుంచి 347 మంది నిరుద్యోగ యువత హాజరై ఇంటర్వ్యూలు పూర్తి చేసుకున్నారు. వీరిలో 248 మందిని తదుపరి ఎంపిక ప్రక్రియకు షార్ట్‌లిస్ట్ చేశారు. ఇప్పటికే మొదటి విడతలో 25 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా, గురువారం నిర్వహించిన రెండో విడత ఎంపిక ప్రక్రియలో మరో 31 మంది ఎంపికయ్యారు. దీంతో రెండు విడతల్లో ఉద్యోగాలు పొందిన వారి సంఖ్య 56కు చేరింది. రెండో విడతలో మండలాల వారీగా ఆమనగల్ నుంచి 9 మంది, వెల్దండ నుంచి 6 మంది, కడ్తాల్ నుంచి 2 మంది, తలకొండపల్లి నుంచి 8 మంది, కల్వకుర్తి నుంచి 4 మంది, మాడ్గుల నుంచి 2 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

**యువతకు అభినందనలు తెలిపిన ఫౌండేషన్ చైర్మన్....**

ఉద్యోగాలకు ఎంపికైన 56 మంది అభ్యర్థులకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విధుల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ ఉద్యోగాల ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మిగిలిన షార్ట్‌లిస్ట్ అభ్యర్థులకు కూడా సంస్థ నియామక విధానానికి అనుగుణంగా తదుపరి విడతల్లో ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా అందించేందుకు ఐక్యత ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగావకాశాల కోసం అర్హులైన నిరుద్యోగ యువత 9848244119 నంబర్‌ను సంప్రదించాలని ఫౌండేషన్ సూచించింది. మరిన్ని

# ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలి

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వ్యవసాయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రాష్ట్రంలోని అన్ని రైతు వేదికల్లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జీవన ఎరువుల వినియోగాన్ని పెంచాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, పంట మార్పిడిని ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు, ఎరువుల వినియోగం, వ్యవసాయ నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎల్లికల్ గ్రామంలోని రైతు వేదికలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంతరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్ర, బీఎఫ్ఏసీ చైర్మన్ గోలి సుదర్శన్ రెడ్డి, ఏడీఏ కె. మంజుల, మండల వ్యవసాయ అధికారి సురేష్, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి శివశంకర్ రెడ్డి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.





## ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

**క్రైమ్ మిర్రర్ సైబరాబాద్:** పండుగ సాయన్న జయంతి వేడుకలను రాయదుర్గం విలేజ్ ముదిరాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదటగా దర్గా చౌరస్తా నుంచి రాయదుర్గం విలేజ్‌లోకి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో "పండుగ సాయన్నకు జోహార్లు", "బహుజనుల రాజ్యం సాధిద్దాం", "బీసీల ఐక్యత వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు. అనంతరం గ్రామ బొడ్రాయి వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గ్రామ ముదిరాజ్ నాయకులు మాట్లాడుతూ, ముదిరాజుల ఐక్యతను చాటిచెప్పేందుకు పండుగ సాయన్న చేసిన త్యాగాన్ని గుర్తుచేశారు. నాటి నవాబుకు వ్యతిరేకంగా గ్రామ ప్రజలను ఏకం చేసి, ప్రజలకు అనేక సేవలు అందించిన మహనీయుడు పండుగ సాయన్న అని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయంగా ముదిరాజుల అభివృద్ధితో పాటు మిగతా బీసీ వర్గాలను ఐక్యం చేసేందుకు ముదిరాజులు ముందుండి నడిపించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ గ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా బండెల రాంచంద్రరెడ్డి నియామకం



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్ రావు ఆదేశాల మేరకు బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన బండెల రాంచంద్రరెడ్డికి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామ పంచాయతీలో సర్దార్ పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆవుల సుందర్ యాదవ్ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ రెడ్డి , అన్నెపు కార్తీక్, ఈరమళ్ళ బాలరాజ్, ముత్యాలు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

o పండుగ సాయన్న జీవితం ధైర్యసాహసాలకు, సామాజిక చైతన్యానికి ప్రతీక

o మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించాలి

o జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూల్):** నాగర్ కర్నూల్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....సమాజంలో ధైర్యసాహసాలకు, ప్రజల పట్ల నిబద్ధతకు, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన మహనీయుల జీవిత చరిత్రలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. సమాజ శ్రేయస్సు కోసం కృషి చేసిన వారి సేవలను స్మరించుకోవడంతో పాటు, వారి జీవితాల నుంచి స్ఫూర్తి పొందాలని తెలిపారు. పండుగ సాయన్న ముదిరాజ్ చరిత్రను భావితరాలకు తెలియజేయడం ఎంతో ముఖ్యమని, ముఖ్యంగా యువత ఆయన జీవిత విశేషాలను తెలుసుకొని ధైర్యం, ఆత్మవిశ్వాసం, సేవాభావం వంటి సద్గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. మహనీయుల జయంతి వేడుకలు కేవలం నివాళులర్పించే కార్యక్రమాలకే పరిమితం కాకుండా, వారి ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రేరణ కల్పించాలని తెలిపారు. సమాజ అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని, వెనుకబడిన వర్గాల ప్రజలు విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి రంగాల్లో ముందుకు సాగేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, విద్య ద్వారా సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని, ప్రతి కుటుంబం పిల్లల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.సమాజంలో సమానత్వం, ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని, సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, డిఆర్ఓ పాండు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిని ఇందిర,డిటిడిఓ కొటయ్య ,ఆర్డీవోలు అర్చన, జనార్దన్ రెడ్డి, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, ప్రతినిధులు తదితరులు పాల్గొని పండుగ సాయన్న ముదిరాజ్‌కు నివాళులర్పించారు.

# జనాభా గణన రెండో దశను పకడ్బందీగా నిర్వహించాలి






o విధి విధానాలను ఖచ్చితంగా పాటించాలి, తప్పిదాలకు తావులేకుండా చూడాలి

o జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూల్):** నాగర్ కర్నూల్ జిల్లాలో జనాభా గణన రెండో దశను పకడ్బందీగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది భారత ప్రభుత్వం నిర్దేశిత విధి విధానాలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. జనాభా గణన ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జనాభా గణన రెండో దశ అధికారులకుజిల్లా అధికారులు, ఆర్డీవోలు , మున్సిపల్ కమిషనర్లు, జనగణన చార్జ్ అధికారులు, సహాయ చార్జ్ అధికారులకు అవగాహన కల్పించేందుకు గురువారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌లోని ప్రధాన హాల్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవసహాయం కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండో దశలో చేపట్టాల్సిన విధులు, బాధ్యతలు, అనుసరించాల్సిన కార్యాచరణపై సంబంధిత అధికారులకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ... జనాభా గణన అత్యంత ప్రాధాన్యమైన ప్రభుత్వ కార్యక్రమమని, ఈ ప్రక్రియలో సేకరించే సమాచారం ప్రామాణికంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జనాభా గణనకు సంబంధించి భారత ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా తెలుసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. సమాచార సేకరణ, నమోదు తదితర ప్రక్రియల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రతి వివరాన్ని జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. జనాభా గణన రెండో దశలో తమకు కేటాయించిన బాధ్యతలను అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. శిక్షణలో వివరించే అంశాలను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకొని, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సమయంలో వాటిని తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సందేహాలను శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకొని, నిర్దేశించిన పద్ధతుల ప్రకారం ముందుకు సాగాలని సూచించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణ కార్యక్రమంలో జనాభా గణన రెండో దశలో చేపట్టాల్సిన పనులు, సంబంధిత అధికారుల బాధ్యతలు, విధుల నిర్వహణలో పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఛార్జ్ అధికారులు, అసిస్టెంట్లకు హైదరాబాద్ నుంచి వచ్చిన శిక్షకులు శివరామకృష్ణ, రిషిత్ రెడ్డి శిక్షణ అందించారు. జనాభా గణన ప్రక్రియలో భాగంగా తమకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన అంశాలను శిక్షకులు వివరించారు. శిక్షణలో నేర్చుకున్న విధివిధానాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ, జనాభా గణన రెండో దశను విజయవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ శిక్షణ తరగతుల్లో సిపిఓ సుజాత, డీఈఓ రమేష్ కుమార్, ఆర్డీవోలు అర్చన, జనార్దన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## పెద్దకాపర్తిలో ప్రభుత్వ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** పెద్దకాపర్తిలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో పర్యావరణ పరిరక్షణ, ప్రకృతిపై ప్రభావం, భవిష్యత్తులో నీటి ఎద్దడి నివారణ, విద్యుత్ వినియోగం, పంటల నష్టాలపై ప్రభుత్వ కళాబృందం పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించింది. సర్పంచ్ కాటం వెంకటేశం అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షపు నీటిని సకాలంలో వినియోగించుకోవాలని, వరద కాలువలు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని కళాబృందం పాటల ద్వారా వివరించింది. నీటి వృథాను అరికట్టి, భూగర్భ జలాలను పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించవచ్చని ప్రజలకు సూచించింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, ఉపసర్పంచ్ కోర్సు సైదులు, వార్డు సభ్యులు ఏర్పుల గురు యాదయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ చేకూరి మల్లేష్, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న జగదీశ్వర్ గౌడ్, యలమంచి ఉదయ్ కిరణ్..

**క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి :** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శంషాబాద్‌లోని మల్లికా కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కీలక సన్నాహక సమావేశంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్‌తో కలిసి మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి అభ్యర్థిత్వం, ఎన్నికల సన్నద్ధత, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాల్సిన అవసరాన్ని నాయకులు నొక్కి చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఏఐపీసీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, మాజీ ఎంపీ మల్లు రవి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు పరజాత నరసింహారెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌ఛార్జ్ బండి రమేష్, కుత్బుల్లాపూర్ ఇన్‌ఛార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, చల్లా నరసింహారెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. అలాగే పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్లు, మండల, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సింగరేణి ప్రగతిలో మందమర్రి ముందంజ

**౦ ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమష్టి కృషి చేయాలి**

**౦ డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు సూచన.. గనుల పనితీరుపై సమీక్ష**

**మందమర్రి అక్టోబర్ 22( క్రైమ్ మిర్రర్):** సింగరేణి నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, కార్మికులు సమష్టిగా కృషి చేయాలని సంస్థ డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు సూచించారు. సింగరేణి అభివృద్ధిలో మందమర్రి ఏరియా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. గురువారం ఏరియాలో పర్యటించిన ఆయన గనుల పనితీరును సమీక్షించడంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, ఇతర అధికారులు డైరెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం గనులు, ప్రాజెక్టుల అధికారులు, ఏజెంట్లతో సమావేశమైన ఆయన ఉత్పత్తి లక్ష్యాలు, ప్రస్తుత ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. ప్రొజెక్టర్, గని ప్రణాళికల ద్వారా పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం కేకే ఓపెన్‌కాస్ట్ గని వ్యూ పాయింట్‌ను సందర్శించి క్వారీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుపై దృష్టి సారించాలని, రక్షణ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు.మూసివేసిన కేకే-2 గని సమీపంలోని నర్సరీ వెనుక రెండు హెక్టార్ల విస్తీర్ణంలో చేపట్టిన ఆయిల్ పామ్ మొక్కల నాటే కార్యక్రమంలో డైరెక్టర్ పాల్గొన్నారు. మందమర్రి ఏరియాలో ఈ సాగు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ మొక్కల జీవితకాలం సుమారు 30 ఏళ్లు ఉంటుందని, వాటిని సక్రమంగా సంరక్షిస్తే సంస్థకు దీర్ఘకాలికంగా ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఈ విధానాన్ని ఇతర సింగరేణి ఏరియాల్లోనూ విస్తరించాలని ఆకాంక్షించారు.మందమర్రి పట్టణ ప్రజల నీటి అవసరాల కోసం చెత్లాపూర్‌లో ఏర్పాటు చేసిన నూతన పంప్‌హౌస్‌ను డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు, జీఎం ఎన్.




రాధాకృష్ణ ప్రారంభించారు. మూసివేసిన కేకే-1 గనిలోని నీటిని పంప్‌హౌస్‌కు తరలించి, శుద్ధి చేసిన అనంతరం ప్రజలకు అందిస్తున్నట్లు జీఎం వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నీటిని, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని సూచించారు.అనంతరం సింగరేణి భవిష్యత్ అవసరాలకు కీలకమైన శ్రావణపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళికా ప్రాంతాలు, ప్రభావిత గ్రామాలను డైరెక్టర్ సందర్శించారు. ప్రాజెక్టు ప్రణాళికలు, పురోగతికి సంబంధించిన అంశాలను పరిశీలించారు.ఈ పర్యటనలో ఏరియా ఎస్వోటూ జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శులు సలేంద్ర సత్యనారాయణ, దాగ మల్లేష్, ఏరియా ఇంజినీర్ (ఈఅండ్ఎం) బాలాజీ భగవతి, కేకే ఓసీ ప్రాజెక్టు అధికారి రాంబాబు, కేకే గ్రూప్ ఏజెంట్ ఖాదిర్, శాంతిఖని ఏజెంట్ సంతోష్ కుమార్, డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, అటవీ అధికారి నవీన్, డీజీఎం (సివిల్) మదీనా భాష, డీజీఎం (సర్వే) భూక్య దేశాయ్, ఏరియా భద్రతాధికారి వెంకటేశ్వర్ రెడ్డి, వర్క్‌షాప్ ఇన్‌ఛార్జి డీజీఎం నరేష్ తదితర అధికారులు, ఇంజినీర్లు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో ఘనంగా పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలు

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** తెలంగాణలో బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, పేదల పక్షాన నిలిచిన రాబిన్‌హుడ్ పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను గురువారం కల్వకుర్తిలో ముదిరాజ్ సంఘం, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పండుగ సాయన్న జయంతి అక్టోబర్ 22న, వర్ధంతి డిసెంబర్ 10న అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న సేవలను, పేదల కోసం ఆయన చేసిన పోరాటాలను నాయకులు స్మరించుకున్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సింగం విజయ్ గౌడ్, బీసీ సబ్‌ప్లాన్ తాలూకా అధ్యక్షుడు రాజేందర్, డీఎఫ్‌సీఎస్ జిల్లా డైరెక్టర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొడుగు బాల్ చందర్ ముదిరాజ్ పాల్గొన్నారు. అలాగే ముదిరాజ్ సంఘం తాలూకా నాయకులు పుట్ట శేఖర్, ఎముక



జంగయ్య, కొల్లూరు శ్రీధర్, అనంత శేఖర్, పుస్తకాల రాహుల్, పుట్ట వెంకటయ్య, కుంభం భీమయ్య, గుడి శ్రీనివాసులు, కుంభం సురేష్, వనం వీరస్వామి, కృష్ణ గౌడ్, తాళ్ల పండు గౌడ్, ఎండి రుక్మాదిన్, యంగంపల్లి రామస్వామి, గాదముని సురేందర్ గౌడ్, శేఖర్ ముదిరాజ్, యాదయ్య ముదిరాజ్, జిల్లెల్ల జంగయ్య ముదిరాజ్, రాము ముదిరాజ్, మొగులాన్ ముదిరాజ్, తల సురేష్ గౌడ్, భాస్కర్ గౌడ్, బచ్చలకూర శ్రీశైలం, టైలర్ సురేష్ గౌడ్, పీట్ల చెన్నయ్య, శ్రీకాంత్ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, కుమ్మ గోని పాండు గౌడ్, గారెల సత్యం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వీరుడు పండుగ సాయన్న జయంతి...!

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** పెగడపల్లి మండల కేంద్రంలో మండల ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాబిన్ హుడ్ పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి



స్వీట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మండల ముదిరాజ్ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో దొరలు భూస్వాములు ప్రజలను పన్నుల రూపంలో నిరంతరం దోచుకుంటున్న సందర్భంలో వారి ఆకృత్యాలకు బలైన కుటుంబం నుండి సాయన్న అనే బహుజన వీరుడు పుట్టాడు. పేద ప్రజలకు చేసిన సేవలను ఆకలితో అలమటిస్తున్న ప్రజల ఆకలి తీర్చిన ప్రజా నాయకుడిగా, మితిమీరిన భూస్వాముల ఆగడాలను ఎదిరించి, దొరలు దేశ్ ముక్ లకు సింహ స్వప్నమై వీరుడు తమ హక్కుల సాధనకై పోరాడి ప్రాణాలను అర్పించిన బహుజన విప్లవ వీరుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు దండు రమేష్, మండల ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి శ్రీనివాస్ ఎల్లాపూర్ సర్పంచ్ పులి రాజేశం, నందగిరి గ్రామ ఉపసర్పంచ్ తౌటు శేఖర్ మండల ముదిరాజ్ నాయకులు సింగసాని స్వామి తౌటు గంగాధర్ మడిగల తిరుపతి కుందేళ్ళ ముని మన్నే గంగరాజం, పిట్టల కర్ణాకర్, సుదర్శన్ గంగాధర్ దండు గంగన్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు గర్వంద సతీష్ గౌడ్, ముల్క రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# బుల్కాపురం గేట్ వద్ద ఫార్చ్యూనర్ బీభత్సం.. గొర్రెల మందపైకి దూసుకెళ్లిన కారు!

**గొర్రెల కాపరికి భారీ నష్టం.. బాధితుడిని పరామర్శించిన బండమీది వెంకటేష్**

**బాధితుడికి రూ.4 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్**

**క్రైమ్ మిర్రర్,శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపురం గేట్ వద్ద శంకర్‌పల్లి,హైదరాబాద్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం గొర్రెల కాపరి కుటుంబంలో విషాదాన్ని నింపింది. వేగంగా వచ్చిన టయోటా ఫార్చ్యూనర్ కారు రోడ్డు పక్కన ఉన్న గొర్రెల మందను ఢీకొట్టడంతో పెద్ద సంఖ్యలో గొర్రెలు మృత్యువాతపడగా, మరికొన్ని తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ఈ ఘటనలో బాధిత గొర్రెల కాపరికి న్యాయం చేయాలని చేవెళ్ల నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మండల కురుమ సంఘం అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త బండమీది వెంకటేష్ డిమాండ్ చేశారు.

**బాధితుడికి అండగా బండమీది వెంకటేష్**

ప్రమాద విషయం తెలుసుకున్న బండమీది వెంకటేష్ వెంటనే ఘటనాస్థలికి చేరుకుని బాధిత గొర్రెల కాపరిని పరామర్శించారు. మృతి చెందిన గొర్రెలను పరిశీలించి, గాయపడిన గొర్రెల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గొర్రెలను కోల్పోయి ఆవేదనలో ఉన్న బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. గొర్రెల పెంపకమే జీవనాధారంగా బతుకుతున్న పేద కుటుంబాలకు ఇలాంటి ప్రమాదాలు తీరని నష్టాన్ని కలిగిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి గొర్రెలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్న కాపరి కుటుంబం ఒక్కసారిగా ఆర్థిక ఇబ్బందుల్లో పడటం బాధాకరమన్నారు.

**రూ.4 లక్షల నష్టపరిహారం అందించాలి**

ప్రమాదంలో నష్టపోయిన గొర్రెల కాపరికి తక్షణమే రూ.4 లక్షల నష్టపరిహారం అందించాలని బండమీది వెంకటేష్ డిమాండ్ చేశారు.



ప్రమాదానికి కారణమైన వాహన యజమాని నుంచి చట్టప్రకారం నష్టపరిహారం ఇప్పించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శంకర్‌పల్లి పోలీసులను కోరారు. అదేవిధంగా ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని, గాయపడిన గొర్రెలకు ఉచిత పశువైద్య సేవలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**అతివేగాన్ని నియంత్రించాలి**

ప్రధాన రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వెంకటేష్ కోరారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. గొర్రెల కాపరుల జీవనోపాధికి నష్టం కలిగించే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల తదుపరి చర్యల వివరాలు అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. బాధిత గొర్రెల కాపరికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని బండమీది వెంకటేష్ తెలిపారు.

# కంభంపాటి ముత్తమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు

**చిట్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీత రమేష్**

**కంభంపాటి సతీష్ కుటుంబానికి ప్రముఖుల పరామర్శ..... ప్రగాఢ సానుభూతి**

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నల్గొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు, చిట్యాల శ్రీ భవాని శాలివాహన సహకార సంఘం ఉపాధ్యక్షుడు, సాక్ష్యం తెలుగు జాతీయ దినపత్రిక ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో కంభంపాటి సతీష్ మాతృమూర్తి కంభంపాటి ముత్తమ్మ ఇటీవల స్వర్గస్థులైన నేపథ్యంలో గురువారం పలువురు ప్రముఖులు ఆమె స్వగ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చిట్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీత రమేష్, కౌన్సిలర్లు కుక్కల మోహన్, దేశపాక లత రాజేష్, చిట్యాల లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పాటి దివాకర్ రెడ్డి (రాజు), కాంగ్రెస్ నాయకులు అమరోజు మదన్, నాగిళ్ల హరి తదితరులు కంభంపాటి ముత్తమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కంభంపాటి సతీష్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, ముత్తమ్మ మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పిస్తూ, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు.



# వట్టిపల్లిలో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

**51 వేలకు దుర్గామాత కలశం కైవసం**

**మర్రిగూడ (క్రైమ్ మిర్రర్):** మండల పరిధిలోని వట్టిపల్లి గ్రామంలో కొలువుదీరిన దుర్గామాత ఆలయంలో, నిర్వహించిన దేవి నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారి కలశానికి వేలంపాట నిర్వహించగా, గ్రామానికి చెందిన కొంపల్లి నాగరాజు గౌడ్ 51 వేల 516 రూపాయలకు కలశాన్ని కైవసం చేసుకున్నారు. నవరాత్రి ఉత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో, ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన కలశం వేలంపాటలో, కొంపల్లి నాగరాజు గౌడ్ కలశాన్ని దక్కించుకున్నారు. నవరాత్రి వేడుకలతో వట్టిపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, ఉత్సవాలు భక్తుల ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.



# పెద్దకొండూరు బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా శ్రీకాంత్ గౌడ్

**ఏకగ్రీవంగా ఎన్నిక.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తా**



**క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:** చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు గ్రామంలో గురువారం భారతీయ జనతా పార్టీ గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్ నేత హాజరైన ఈ సమావేశంలో గ్రామ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా కాసుల శ్రీకాంత్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ సమావేశంలో గ్రామ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ కాయితి రమేష్ గౌడ్, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ దుర్గా కృష్ణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి యాస అశోక్ రెడ్డి,బీజేవైఎం మండల అధ్యక్షులు అల్మాసిపేట గౌతమ్,మాజీ అధ్యక్షులు మొర నాగేష్, వార్డ్ సభ్యులు ముప్పిడి స్వాతి పరమేష్ గౌడ్ బిజెపి సీనియర్ నాయకులు ఎదుగని శ్రీనివాస్, బీర్ల లింగస్వామి,కాయితి యాదయ్య గౌడ్, పాక వెంకటేష్, పోలాబోయిన బాలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి టీఆర్ఎస్ రాజధాని రణభేరి ని జయప్రదం చేయాలి..

**వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్...**



**క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి :** టిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత అధ్యక్షతన రాబోయే గ్రేటర్ ఎలక్షన్స్ కు సంబందించి రాజధాని రణభేరిలి కార్యక్రమం మియాపూర్ లోని నరేన్ గార్డెన్స్ లో జరుగుతుందనీ ఉమ్మడి గ్రేటర్ హైదరాబాద్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జీ వాసిలీ చంద్రశేఖర్ ప్రసాద్ తెలిపాడు. ఈ సందర్భంగా గురువారం రోజు పార్టీ నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమం లో గ్రేటర్ హైదరాబాద్ ఇంచార్జ్ లు, జిల్లా అధ్యక్షులు, ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొంటారు. మియాపూర్ ఆల్విన్ సర్కిల్ నుండి నరేన్ గార్డెన్స్ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందనీ పేర్కొన్నారు. తెలంగాణ రక్షణ సేన నాయకులు మరియు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా జెపల్లి సర్పంచ్ అమీనా అశోక్ జన్మదిన వేడుకలు



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం జెపల్లి గ్రామ సర్పంచ్ అమీనా అశోక్ జన్మదిన వేడుకలను అభిమానులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అమీనా అశోక్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలకు సేవ చేస్తూ గ్రామ అభివృద్ధిలో మరింత ముందుకు సాగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జూపల్లి గ్రామ సర్పంచ్ అనూష జగపతి, శ్రీరాములు, తిరుపతయ్య యాదవ్, శేఖర్, సత్యం యాదవ్, జూపల్లి భాస్కరరావు, యువసేన అధ్యక్షుడు మహమ్మద్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.